

# నగరం ఒళ్ళు విరుచుకొంటోంది.

దాని అంగాలను మెల్లమెల్లగా కదిలిస్తున్నాయి సిటీబస్సులు. పచ్చరంగు సిటీబస్సులు నలుదిక్కులా దూసుకుపోతున్నాయి. పైకి లేవని దుకాణాల షట్టర్స్ ముందున్న మానవాకారాలు ఇంకా ముడుచుకొనే వున్నాయి.

రంగురంగు యూనిఫారాలల్లో వున్న స్కూలు పిల్లలు రోడ్లకు జీవం పోస్తున్నారు. చౌరస్తాలో సిటీ బస్సు ఆగింది. సిటీబస్సు దిగిన వీరయ్య అటూ యిటూ దిక్కులు చూశాడు.

తన చంకలో వున్న గోనె సంచిని దించి. అందులో వున్న సత్తుపళ్ళాన్ని. సత్తుగ్లాసుని. చిరిగిన బట్టలనుసర్ది. మళ్ళీ బిగదీసి



కట్టి.చంకలో బెట్టుకొని ముందుకి కదిలాడు. దారివెంట వెళ్తూన్న ఒక సైకిలిస్టుకు దణ్ణంబెట్టి ఆపి. తన చేతిలో వున్న చీటీ చూపించాడు.

"ఇటు....సీదా....నడువ్. అక్కడ గుట్టపక్కనే వుంది పెద్ద బంగ్లా తేలిగ్గా గుర్తుపట్టవచ్చు" అంటూ వెళ్ళిపొయ్యాడు.

కళ్ళపై అరచెయ్యి అడ్డం పెట్టుకొని తేరిపారచూసి రోడ్డు లంకించుకున్నాడు అతను. పెద్ద పెద్ద అంగలు వేస్తూ దిక్కులు చూస్తూ.

# చితికిన గూళ్ళు...

## తాడిగిరి పోతరాజు

## 1985 రక్తాక్షి సంక్రాంతి కథల పోటీలో రూ.1 500 ప్రథమ బహుమతి పొందిన రచన

తాడిగిరి పోతరాజు



హుజూరాబాద్ (కరీంనగర్ జిల్లా) శివారు గ్రామాలలోని "కోతులనడుమ"లో చిన్న రైతు కుటుంబం. లోగడ "గాజు కిటికీ" – "చివరి అంచున" – ఆంధ్రప్రభ వారపత్రిక కథల పోటీలో – "ఆరోహక గీతం" – "స్వాతి" – కథల పోటీలో ద్వితీయ బహుమతులు పొందాయి.

నవల "మట్టి బొమ్మలు" – ఆంధ్ర సచిత్ర వారపత్రిక నిర్వహించిన ఉగాది పోటీలో ప్రథమ బహుమతి పొందింది. "మట్టి బొమ్మలు" —— "గాజు కిటికీ" —— లను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. కొన్నికథలు హిందీ, కన్నడ భాషలలోకి అనువదించబడ్డాయి.

'సృజన-భారతి-ఆంధ్రప్రభ-ఆంధ్రజ్యోతి-ఆంధ్రపత్రిక-స్వాతి-జ్యోతి మొదలైన పత్రికలలో కథలు వచ్చాయి. (ఒక్క-దయ్యాల వారపత్రికలో తప్ప.)

రైతులు, రైతు కూలీలు దగాపడిన తమ్ముళ్ళ ప్రక్కన నిలబడి, కరీంనగర్ జిల్లాలో ఉద్యమాలు నిర్వహించిన కారణంగా ప్రభుత్వం ఎమర్జెన్సీకాలంలో వరంగల్ జైలులో నిర్బంధించింది. "మీసా చట్టంక్రింద అరెస్టయిన కారణంగా ఉద్యోగం నుంచి బర్తరఫ్ చెయ్యబడ్డారు. కేంద్రంలో అధికారానికొచ్చిన జనతా ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసిన ఉత్తర్వుల ఫలితంగా మళ్ళీ ఉద్యోగంలో పునరావాసం కలిగింది.

'భారత్ బంద్' సందర్భంగా ముందు జాగ్రత్త చర్యగా మరొకసారి ప్రభుత్వం జైల్లో పెట్టింది కరీంనగర్‌లో.

ప్రస్తుతం ప్రభుత్వ బాలికా కళాశాలలో ఇంగ్లీషు లెక్చరర్‌గా కాలం వెళ్ళబుచ్చుతున్నారు.

రెండు గాడిదలు గోడమీద నవ్వుతూన్న సినిమా తారలను పీక్కు-తింటున్నాయి. పొద్దు వాల్గి బారలెక్కినా, నడిరోడ్డులో కాళ్ళు అరజాపిన గోమాతలు విశ్రాంతగా నెమరు వేస్తున్నాయి. రోడ్డుకిరువైపులా ఎత్తయిన, సువిశాలమైన భవనాలు నర సంచలనం లేని భవనాలు.

రోడ్డు కొండపైకి పాకింది. శరీరాన్ని ఈడ్చుకుంటూ, చెమటలు కార్చుకుంటూ ముందుకు నడవ సాగాడు అతను. నడిచి నడిచి ఆగిపొయ్యాయి అతని కాళ్ళు. అతని కళ్ళల్లో మెరుపు, శ్రమకు తగిన ఫలితం దొరికిన సంతృప్తి.

ఇంకా గేటు తెరవలేదు.

గేటు ముందు జనం కోలాహలం. అక్కడ జేరిన సరుకంతా తనలాంటి వాళ్ళే. అడా మగా గేటు ముందు ప్రాణాధారం పడుతున్నారు. కొత్తగా చేరిన తనను తేరిపార చూస్తున్నాయి వాళ్ళ కళ్ళు.

కళ్ళు-నీరుకారుతూన్న కళ్ళు-చీకిరించుకొని చూసే కళ్ళు. నొసట చెయ్యి అడ్డం పెట్టుకొని పరీక్షగా చూసే కళ్ళు. కళ్ళపై అట్ట ముక్కలు, గుడ్డ ముక్కలు వ్రేలాడుతున్న కన్నులు. గాజు పట్టీల వెనుక దాగిన కన్నులు. మరొక మనిషిని ఆసరాగా పెట్టుకొని, ఆకాశం వంకనో, లేక మరొక దిక్కుగానో స్థిరంగా చూసే కళ్ళు-ఆరిపోయిన దీపాలు.

వాళ్ళందరూ మూసి వుంచిన గేటు తలుపులు ఎప్పుడు తెరుస్తారాఅని ఎదురు చూస్తున్న పేషెంట్స్. కంటి రోగులు. మూసిన గేటుపై వాళ్ళ చూపులు.

గేటు కిరువైపులా జడలు విరబోసుకొన్న బోగన్ విలియా పొదలు రక్తం కక్కుతున్నాయి. ఆ పూలక్రింద దాక్కున్న సిమ్మెంటు దిమ్మె. దిమ్మెలో చతురస్రాకారపు ఇత్తడి ఫలకం. ఫలకం పై అందమైన ఇంగ్లీషు అక్షరాలు.

డాక్టర్ ఫణీంద్ర యఫ్. ఆర్. సి. యస్.

ఇంకా ఎన్నో డిగ్రీలు, ఎన్నో అర్హతలు. జనానికి తెలియని డిగ్రీలు. జనం కనీ వినీ ఎరుగని డిగ్రీలు. ప్రజలను గిలిగింతలు పెట్టే డిగ్రీలు. ప్రజలను వంచించే డిగ్రీలు. అసలు పేరు కన్న పొడుగున్న డిగ్రీలు.

తొమ్మిదయింది. గేటు క్రమంగా రెండు ముక్కలుగా విచ్చుకుపోయింది. బిలబిలమంటూ రోగులు, వారికి ఆసరాగా వచ్చిన మనుషులు, కెరటాలు కెరటాలుగా లోనికి విరుచుకు పడ్డారు.

కాంపౌండర్ పంచుతున్నాడు బిళ్ళలను, డబ్బా నుంచి తీసి. పిల్లలు చాక్‌లెట్లకు ఎగబడినట్లు రోగులు బిళ్ళలకోసం ఎగబడుతున్నారు. బిళ్ళ దొరికినవాళ్ళు నంబరుచూసికొని హాల్లో అమర్చిన బెంచీలపై చతికిలపడుతున్నారు.

కళ్ళను పరీక్షచేయించుకోవడానికొచ్చిన రోగి నెంబరు తీసికొని లైనులో నిలబడాలి. సీనియారిటీని నిర్ణయించేది నంబరు బిళ్ళ. అట్టముక్కలు కత్తిరించి, నంబరు వేసిన బిళ్ళలు. ఒకటి నుంచి యాభై బిళ్ళలు.

వీరయ్యకు ఆ తతంగం అంతుపట్టలేదు. చంకలో గోనె సంచి పెట్టుకుని నిలబడి కళ్ళప్పగించి చూస్తున్నాడు. నలభై తొమ్మిది బిళ్ళలు పోయినయి. యాభైవ బిళ్ళ చేతిలో పెట్టుకొని పోర్టికోలో నిలబడివున్న వీరయ్యను గద్దించాడు కాంపౌండర్,

"అరేయ్ ముసిలోడా! దేనికొచ్చావిక్కడికి. కళ్ళుచూయించుకోవా? ఇదిగో నంబరు బిళ్ళ ఇంకా కొద్దిసేపుంటే ఇది కూడా దక్కదు. మళ్ళీ రేపే" అంటూ.

చంకలో వున్న గోనెసంచిని, ప్రహరీ ప్రక్కనున్న అశోక వృక్షాల చాటున దాచుకొని పరుగెత్తుకొచ్చాడు.

"బాంచను....బాంచను... నాకెరికలేదు గీముచ్చట" .... క్షమాపణ కోరుతూన్న కంఠంతో చెప్పులు విడిచి, ముందుకు వంగి దోసిలి పట్టాడు. దోసిలిలోకి ఎగిరిపడ్డది యాభై నంబరు బిళ్ళ. మహాప్రసాదంలా బిళ్ళను కళ్ళకద్దుకున్నాడు.

బిళ్ళ అందుకున్న రోగి తన నంబరు రాగానే లోనికెళ్ళి డాక్టర్ ఫణీంద్ర టేబుల్‌పై ఆ బిళ్ళ, ఆ బిళ్ళతోపాటు ఇరవై

అయిదు రూపాయలు పెట్టాలి. అది కన్సల్టేషన్ ఫీజు మాత్రమే.

ట్రీట్ మెంట్ ఫీజు, ఆపరేషన్ ఫీజు, రూమ్ రెంట్ అవన్నీ వేరే బిల్లులో సవివరంగా ఉంటాయి.

కన్సల్టేషన్ ఫీజు యాభై బిళ్ళలకు పరిమితం. యాభై బిళ్ళలు. యాభై చెక్కలు. ఇరవై అయిదు రూపాయల చెక్కలు.

యాభై ఇంటూ ఇరవై అయిదు ఈజీక్వల్టు పన్నెండువందల యాభై రూపాయలు. రోజూ మినిమమ్ ఇన్‌కం ప్రతిరోజూ కనీస రాబడి.

గేటు తీస్తే చాలు....డబ్బు, డబ్బు ...చెలమలో నీరు ఊరినట్లు ఊరే డబ్బు-పైసలు. తన అవసరాలకు, విలాసాలకు కావల్సిన డబ్బు. ఫారిన్‌లో చదువుకుంటూన్న తనపిల్లలకు కావల్సిన ధనం ఈ డబ్బు. క్లబ్బులో పేకాడటానికి కావాల్సిన పెట్టుబడి ఈ డబ్బు. చందాలు, విరాళాలు ఇచ్చి సమాజంలో గౌరవస్థానం సంపాదించుకోడానికి వినియోగపడే కరెన్సీ నోట్లు ఈ డబ్బు. అన్ని అవసరాలూ సరదాలూ తీరగా ఫిక్సెడ్‌డిపాజిట్ రూపంలో, సేవింగ్స్ రూపంలో గుడ్లుపెడుతున్నబ్యాంక్ ఎకౌంట్ ఈ డబ్బు. ఈ ఫీజులు.

రోగులు ఒక్కొక్కరే వెళ్ళి పరీక్ష చేయించుకుంటున్నారు.

పన్నెండయింది.

హారన్-కారు హారన్. చెవులు గింగురుమనే హారన్. వీరయ్య లేచి ప్రక్కకు జరిగాడు. చిన్న కారు పోర్టికోలోకి దూసుకొచ్చింది. ప్రీమియర్ పద్మిని. తెల్ల కారు. డ్రైవర్ సీట్లో గాగుల్స్ పెట్టుకున్న గొప్పింటి మహిళ. గుర్రపుతోకలా జుట్టుకట్టుకున్న స్త్రీ.

ఆమె వెనుక సీటుపై రెండు తెల్లి బొచ్చు కుక్కలు. సగం వరకూ పైకెత్తిన గాజు కిటికీలు ఈవలగా తలలు పెట్టి నాలుకలు చాచి చూస్తున్నాయి. వీరయ్యను చూడగానే రోమాలు నిక్కబొడిచేలా అరిచాయి. అతను గేటు వద్దకు ఒక్క ఉదుటున పరుగెత్తాడు.

సన్నగా, పొడుగ్గా, తెల్లగా ఉన్న ఆమె, చెంగున కారుదిగి పగలబడినవ్వింది. ఆనందంగా హాయిగా నవ్వుతూ హాల్లో నుంచి లోనికి నడిచింది. ఆ కుక్కలు రెండూ ఆమెతోపాటు లోనికి తుర్రుమన్నాయి.

"పోర్టికోలో....కూర్చోకూడదు....ఆ కుక్కలు కరవ్వు... ఇటురా....మెట్ల ప్రక్కకు....దొరసాని....డాక్టర్‌సాబ్ భార్య". భయపడుతూ, భయపడుతూ లోనికొస్తూన్న వీరయ్యను హెచ్చరించాడు కాంపౌండర్.

సాయంత్రం నాలుగింటికి తనకు పిలుపొచ్చింది. గ్లాసు తలుపుగట్టిగా తోసి లోనికెళ్ళాడు. లోపలంతా చల్లగా ఉంది, చలికాలంలా. ఒణుకుపుట్టుకొచ్చింది. పట్టపగల్లా లోపలంతా వెలుగు అయినా వీరయ్యకు చూపు ఆనలేదు. అట్లాగే నిలబడి తేరిపార చూశాడు.

ఎదురుగ్గా నాల్గుచక్రాల ఇనపబల్ల, బల్లపై మనిషి. బల్లకు ఒక వైపు మల్లెపువ్వులాంటి ఇద్దరు నరసమ్మలు. బల్లకు రెండో వైపు ఇద్దరు డాక్టర్లు. నెత్తికి టోపీలు-మూతులకు గుడ్డలు కట్టుకొన్న డాక్టర్ బాబులు. కన్నాలు వెయ్యటానికి రెడీగా ఉన్న దొంగల్లా.

ఈ మూలన ఇటువైపు పెద్ద డాక్టర్‌బాబు బల్లపై ముందుకు వంగబడి ఏదో వ్రాసుకుంటున్నాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ భయం భయంగా అక్కడకు నడిచాడు.

"పేరు....?" డాక్టర్ తల ఎత్తకుండా ప్రశ్నించాడు.

"ఈరయ్య" అంటూ నంబరు బిళ్ళ దానిపై పదిహేను రూపాయలు పెట్టాడు. డాక్టర్ వేళ్ళ సందున నోట్లు. ఒక పది, ఒక అయిదు నలిగి నలిగి ఉన్న మురికి నోట్లు.

డాక్టర్ కనుబొమలు పైకి లేచాయి. ప్రశ్నిస్తూన్న చూపులు పేషెంటు వైపు తిరిగాయి.

చేతులు రెండూ జోడించి ఉన్నాయి. నల్లగా మొరటుగా ఉన్న చేతులు. నల్లగా మట్టి నిండిన గోళ్ళు. చిరుగుల బనియను. మోకాళ్ళపైకి మడిచిన పంచె. డాక్టర్ చూపులు అతని ముఖం పైకి ప్రాకాయి


ఎండకు ఎండి, కమిలిపోయిన ముఖం. దవడ ఎముకలు పైకితేలి, లోపలికి పోయిన చెంపలు. ఆ చెంపల్లో నుంచి సూదుల్లా పొడుచుకొస్తూన్న తెల్లని వెంట్రుకలు. డెబ్బయి పదులు దాటిన శరీరం. శ్రమించి బ్రతికిన కండరాలు. వయస్సు ముళ్ళ మెత్తగా ఊగుతున్నాయి. జీవితాంతము రెక్కల కష్టంతో బ్రతికిన ఛాయలు.

అతని చూపులు దీనంగా అర్థిస్తున్నాయి. డాక్టర్ అడుగుతూన్న మౌన ప్రశ్నకు జవాబు చెప్పటానికి ఎండి పగుళ్ళు బారిన అతని పెదవులు విప్పుకొన్నాయి.

"ఇక లెవ్వు బాంచను. దణ్ణం బెడతా. నావద్ద గీ పది రూపాయలు తప్ప సిల్లిగవ్వ లేదు. దిక్కులేనివాణ్ని, బతుకంతా రెక్కలు ముక్కలు చేసుకోని బతికినా ఒక పైసా మిగల్లేదు. ఏ పూట కాపూటే. పొట్టకూటికే సరిపోయింది. నీ రుణం ఉంచుకోను. బతికినన్నాలు నీ పాదాల కాడ బడి నీ సేవ సేత్తా. నా పెర్మంతో సెప్పులు కుట్టిత్తా. నామాట నమ్మండ్రి బాంచను."

"ఇదొక నాటకం...." చీదరించుకొన్న చూపులతో చూస్తూ, "నీకు నా అన్నవాళ్ళు ఎవరూ లేరురా ఈ ప్రపంచంలో." అన్నాడు.

"ఉన్నారు బాంచను ఉన్నారు. నాకు ఒక్కతే బిడ్డ. నా బిడ్డను సాయాన నా అప్ప కొడుకు, నా మేనల్లుడికిచ్చి లగ్గం చేసినా. తొలిసూరు కానుపు కనలేక సచ్చిపోయింది. అది సచ్చిపోయిన ఆరు నెలలకే ఆడు ఇంకోదాన్ని ఉంచుకున్నాడు. ఆడు మంచోడే కానీ.... కానీ ... కూలికెల్లి ఒక్క రూపాయి సంపాదించనోడికి మా కులంలో కూడులేదు. మొగుడూ, పెళ్లాం, కూలికెల్తేనేగానీ కుండ పొయ్యెక్కదు. నాలాంటి పైమనిసిని ఎన్నాళ్ళని సాకుతారు. అందుకని మా ఊరిడిసిపెట్టి వచ్చినా. ఈడ్నే బస్సు డిపోకాడ సంచులూ, ముల్లెలూ మోసి బతుకుతున్నా.... నేను రాలిపోతే నా మీద పడి ఏడిసేవారెవరూ లేరు....దిక్కు లేని పచ్చిని".... అంటూ నేలపై వాలి తన నుదుటిని భూమిపై అన్చాడు.



రంగుల రాట్నం

—ఎస్. భారతీప్రసాద్, తెలప్రోలు

# దేశ దేశాలలో సంక్రాంతి వేడుకలు

మకర సంక్రమణ దినోత్సవాన్ని ఈజిప్టులో 'నమ్ ఫెస్టివల్' అనే పేరిట జరుపుతారు. 'నమ్' పేరుగల ఈజిప్టియుల జలాధి దేవతకు మకరరాశి ప్రతీకగా భావించి ఈజిప్ట్ దేశీయులు మకర సంక్రమణ వేడుకలు చేస్తారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే సమయంలో నైలునది పొంగిపొర్లి ప్రవహిస్తుందని వారి విశ్వాసం. వాంఛితార్థసిద్ధికీ, సస్యఫలాభివృద్ధికీ మకర సంక్రమణ సందర్భంలో ఈజిప్టియన్లు మకర రాశికి ప్రతిబింబమైన ఈ 'నమ్' దేవత అనుగ్రహార్థం నదీతీరాన ఆరాధనలు జరపటం, పూలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయ మొదలైనవి నీటిలో వదలి నదీమతల్లికి నమస్కరించటం ముఖ్య ఆచారాలుగా ఆచరిస్తారు.

గ్రీకు దేశంలో 'బేకన్ డే' పేరిట మకర సంక్రమణోత్సవ వేడుకలు భారీ ఎత్తున జరుపుతారు. 'మకర రాశి' అనగా గ్రీకుల దృష్టిలో పూర్వ కాయం మేక ఆకారం. అధో కాయం చేప ఆకారం గల జంతు స్వరూపమని చెప్పబడి యున్నది. ఒకసారి నదీతీరాన గ్రీకు జలదేవత 'బేకన్' విహరిస్తుండగా 'టైఫన్' అనే రాక్షసుడు ఆమెను వెంటాడగా అతని భారి నుండి తప్పించుకొనుటకు ఈ వింత ఆకృతిని దాల్చినదని ఆ జల దేవత సత్ఫలార్థం నిహిఘ్న ఫలాభ్యుదయాల్ని కాంక్షిస్తూ గ్రీకులు మకర సంక్రమణ సమయాన 'బేకన్ డే' జరుపుకోనారంభించారు.

రోమ్‌లో మకరరాశిని మన్మధ పరంగా ఆరాధిస్తున్నారు. "క్యాకిన్" అనగా మన్మధుడు అని అర్థము. కనుక మకర సంక్రమణ సమయమున వివాహితలైన స్త్రీలు మన్మధుని ఆరాధించినట్లయిన సంతాన హీనులైన స్త్రీలు తప్పక సంతానవతులు కాగలరనీ, నిర్విఘ్న దాంపత్య సౌఖ్య జీవనం గడపగలరనీ రోమనుల నమ్మకం.

స్వీడన్‌లో జనవరి మాస మధ్యంలో మరణించిన మృత వీరుల సంస్మరణ దినోత్సవం జరపటం. ఆ సందర్భంగా మంటలు వేసి మంటల చుట్టూ తిరుగుతూ మృతవీరుల ఆత్మశాంతికై తుపాకీకాల్పులు జరిపి ప్రార్థన గీతాలు పాడటం పరిపాటి.

—విశాలి

డాక్టర్ కొద్దిగా మెత్తబడ్డాడు. కొన్ని క్షణాలు మౌనంగా పరిశీలించి, "సరేలే.... లే.... లే.... పరీక్ష చేస్తాను. లే.." అంటూ లేపాడు.

"ఏమయింది నీకు?.... దగ్గరకు రా.... నీ కళ్ళు పత్తికాయల్లా బాగానే వున్నాయిగా...." అంటూ స్టూలు చూపించాడు.


"కళ్ళు.... నీరికారతయి బాంచను. సుక్కడాలు-సుక్కలాలు చెయ్యబట్టి సూపు కనిపిస్తలేదు. అపరేశను చేస్తే మంచిగ కనిపిత్తయి. తమరి సల్లని సేత్తో ఆపరేశను చేసి పున్యం కట్టుకోండ్రి.... దొరా!"

డాక్టర్ కుర్చీలో నుంచి లేచి, అతనికి చేరువగా నిలబడి టార్చిలైటు వేసి పరీక్షించాడు. కనురెప్పలు విరిచి లోలోపల భాగాలను పరిశీలించాడు.

"కాట్రాక్ట్....ధటాస్పల్...." అంటూ ఫోకస్ చేసిన టార్చిలైటు ఆర్పివేశాడు.

"మీరేందో బాసలో అంటున్నారు. పైపూత మందులు రాయకండి దొరా. ఆపరేశను సెయండి.."

బాసలో మాట్లాడుతున్నారన్నందుకు డాక్టర్‌కు కోపం వచ్చింది. ముఖం చిట్లించుకొని పిరయ్యకేసి తేరిపారచూస్తూ, కుర్చీలో కూలబడ్డాడు.



—కె.వి.కన్యాకుమారి, పెదతనగల్లు

"ఒరేయ్, ముసిలోడా నీకెందుకు కళ్ళు ఈ వయస్సులో. బడికిపోయి చదువుకుంటావా?, దేనికిరా!"

"బాంచను.. సదువుకోటానికాదండీ. అడుక్కోడానికి. రేపు రెక్కలు పడిపోతే ఇంటింటికి తిరిగి ఒక్క బుక్క బువ్వ అడుక్కొని తింటానికి."

డాక్టర్ నెత్తి మీద టోపీతీసి బల్లపై పెట్టి, పెన్ టార్చిలైట్, కాగితాలూ అన్నీ ఎక్కడి వక్కడ సర్దుకొని, భుజాలపైకి కోటు ఎక్కించుకొంటూ బయటికి కేకపెట్టాడు.

"జనార్దన్...." అని కేకపెట్టి, "ఇదిగో ఇది గవర్నమెంటు హాస్పిటల్ కాదు తెలిసిందా? రేపు గవర్నమెంటు హాస్పిటల్‌కు వెళ్ళి కళ్ళు బాగుచేయించుకో. నడువ్" అన్నాడు. జనార్దన్ లోని కొచ్చాడు.

"ఏమాయనయ్యా! ఎన్నిసార్లు చెప్పాను. ఇటువంటి వాళ్ళను లోనికి పంపద్దని" అంటూ విసవిస నడిచి బయటికి వెళ్ళిపోయ్యాడు.

"బాబ్బాబు నీది సల్లని సెయ్యండి. దరమపెబువులు. గరీబుగాడ్ని నీ సేత్తోనే" అంటూండగా జనార్దన్ రెక్కబట్టుకొని విసురుగ్గా బయటికి లాక్కెళ్ళాడు.

* * *

ఆ రోజు రాత్రి ఎనిమిది గంటలు.

పోర్టికోలో కారు ఆగింది. ఇంపాలా కారు. నేలమీద ఎగిరే విమానంలా రెక్కలున్న కారు. నదీప్రవాహంలో నాజూగ్గా కదిలే పడవలా ఊగుతూ లోనికొచ్చింది. అంత పెద్దకారులో ఒక్కడే వ్యక్తి.

కారు ఆపి డ్రైవరు డోర్ తీశాడు అతని కోసం. అతను సున్నితంగా కారు దిగాడు.

గోల్డ్ రిమ్ కళ్ళద్దాలు, ఇంత వెడల్పు జరీ అంచు ధోవతి, చెంగు నేలను స్పృశిస్తోంది. మోకాళ్ళ వరకూ సిల్కు ఖద్దరు లాల్చీ. గుండ్రంగా సిమ్మెంటు దిమ్మెలా వున్నాడు.

"ఫణీంద్ర వున్నారా?" ప్రశ్న.

"ఆయ్. వున్నారండి లోపల" మెట్లమీద నిలబడివున్న కాంపౌండర్ జనార్దన్ కంగారుపడుతూ సమాధానమిచ్చాడు. అనాలోచితంగా జనార్దన్ చేతులు పైకిలేచి నమస్కరించాయి. అతను ప్రతి నమస్కారం చెయ్యకుండ లోనికి నడువ సాగాడు.

"ఇటు....ఇటురండి" అంటూ జనార్దన్ ముందు నడిచాడు.

ఇంటి వెనుక భాగంలో విశాలమైన అరుగు. అరుగు క్రింది భాగంలో లాన్. లాన్‌లో చిన్న ఆటస్థలం. షటిల్ బాడ్మింటన్ కోర్టు. దాని నలుమూలల్లో అమర్చిన ఫ్లడ్ లైట్స్ కాంతిని చిమ్ము తున్నాయి. వెన్నెల మడుగులా కాంతి. ఆ కాంతిలో ఆట. రెండు జంటలు ఆట ఆడుతున్నాయి. పక్షి ఈకలు పొడిగిన బంతి పైన తిరుగుతోంది. రివ్వు-రివ్వున. కోర్టుదాటిన బంతిని అందించటానికి సేవకులు రెడీగా వున్నారు.

ఆడనివాళ్ళు కూర్చొని వినోదించటానికి వచ్చిని గడ్డిలో కుర్చీలు. గుండ్రని ఫేం కుర్చీలు. వాటిల్లో ఒక కుర్చీలో కూర్చొని డాక్టర్ ఫణీంద్ర చప్పట్లు కొడుతూ బిగ్గరగా అరుస్తు న్నాడు. "ఫైన్....ఫైన్....ఆః గుడ్ హిట్".... అంటూ.

చప్పట్లు ఆగిపోయ్యాయి. అతని కళ్ళల్లోని అయస్కాంతపు ముల్లు ఇద్దరు లాన్‌వైపు గిర్రున తిరిగింది. "హల్లో.... మిస్టర్ పాండూ.... వ్వాట్-ఎ-ప్లెజెంట్ సర్‌ప్రయిజ్...." అంటూ ఉద్విగ్నంగా లేచాడు. చేతులు కలిశాయి. అతిధిని కుర్చీలవైపు నడిపించాడు

"హవ్-డు-యు-డు"....లాంఛనాలు, చిలక పలుకులు.

"ఢిల్లీ నుండేనాః...."

"యస్. యస్."

"క్లబ్ కెళదా మనుకొంటున్నాను. అంతలోనే మీరు వచ్చారు. జస్ట్ లెట్ అయితే మిస్ అయిపొయ్యేవాళ్ళం...."

"అది నా అదృష్టం...." ఇంగ్లీషులో అన్నాడు పాండు.

"ఢిల్లీ.. విశేషాలు ఏమిటిః"

"అంతా మనం అనుకున్నట్టుగానే జరిగింది. పద్మశ్రీ అవార్డ్‌కు మీ పేరు హోం మినిస్ట్రీ ఎన్నిక చేసింది. రెండు మూడు రోజుల్లో అఫిషియల్ కమ్యూనికేషన్ అందుతుంది."

"నిజమా....థాంక్యూ పాండూ థాంక్యూ .. ఇక నా కోరిక నెరవేరింది.... ఇక జీవితంలో అన్నీ సాధించినట్లే. భారతదేశంలో ఉన్న 'ఐ స్పెషలిస్ట్స్' అందరిలోనూ నా పేరు 'పద్మశ్రీ'కి ఎన్నిక కావటం ఎంత గొప్ప...." విమిరిన పిల్లిలా. ఆనంద పారవశ్యంలో మునగడ లేసుకుపొయ్యాడు.


"ఏదీ....మిసెస్ ఫణీంద్ర కనపడరేంః".

"ఉంది. లోపల ఉంది. ఆమె కొంచెం వర్రీడ్‌గా ఉంది. 'లిల్లీ-జూలీ' రెండు రోజులుగా ఆహారం ముట్టుకోటంలేదు. అందువలన డాక్టర్ వద్దకు తీసికెళ్ళి చూపించి, ఇంతకు ముందే వచ్చింది....పిలుస్తాను" అంటూ లోనికెళ్ళి భార్యను వెంటబెట్టుకుని వచ్చాడు. బ్యాక్ గ్రవుండ్‌లో నడుస్తూన్న షటిల్ ఆట ఆగిపోయింది. ఆట ఆపిన రెండు జంటలు వాళ్ళను కలిశాయి. అతిధి పరిచయం, 'నమస్తే'లు, స్తుతితో కూడిన మాటలు. లాంఛన ప్రాయమైన చిరునవ్వులు, పిచ్చినవ్వులూ అన్నీ అయిపోయాయి.


ఆరు కుర్చీలలో ఆరుగురు, ఎదురెదురుగా కూర్చున్నారు. లోపలి నుండి ట్రేలో కూల్ డ్రింక్స్ వచ్చాయి. గ్లాసులు అరచేతిలో పెట్టుకుని 'స్ట్రా' గొట్టాలు పెదవులపై అన్చుకుని ముచ్చట్లాడుతూ కొద్ది కొద్దిగా సిప్ చెయ్యసాగారు.

"లిల్లీ.... జూలీ.... ఆరోగ్యం బాగులేదుట.... ఇప్పుడెలా వుంది." అతిథి ప్రశ్న.

"ఎవరు చెప్పారు మీకు.... డాక్టరా ... పిల్లీ...." అంటూ భర్త వంక కోపంగా చూసి, "లిల్లీ- జూలీ నన్ను విడిచిపెట్టి ఒక్క క్షణం వుండలేవు. షాపింగ్ కెళ్ళినా, క్లబ్ కెళ్ళినా నాకన్నా ముందే కారెక్కుతాయి. లిల్లీ,జూలీ అంటే పంచ ప్రాణాలు నాకు. ఎందుకంటే డాక్టర్ తన పనిలో తాను నిమగ్నమయితే నాకు కంపెనీ ఎవరు" అంటూ నిష్టూరంగా మాట్లాడి తలుపు కేసి చూస్తూ పిలిచింది.


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి


- శస్త్రచికిత్స
అవసరములేదు!

గుడివాడ కాదు ఇప్పుడు విజయవాడలో


కమ్మకులస్థులు ఇక్కడా అక్కడా అని లేదు.
ఎక్కడున్నా సరే సరైన సంబంధాలు సమకూరుస్తాము.
సంప్రదించండి:
కాకతీయ ఇన్‌ఫర్‌మేషన్ సర్వీస్
లారీ ఓనర్స్ అసోసియేషన్ కళ్యాణ మండపం ఎదురుగా
బెంజి సర్కిల్ - విజయవాడ-520006

"లిల్లీ.... జూలీ...." మృదువుగా. లాలనగా. పిలిచింది, దీర్ఘాలు తీస్తూ. తళతళలాడుతున్న రెండు బొచ్చు కుక్కపిల్లలు పరుగెత్తుకొచ్చాయి. చెంగున ఎగిరి ఆమె ఒడిలో వాలి ఆమె మూతిని ముఖాన్ని నాకసాగాయి.

"అరరే ఇవి మనల్ని మాటాడుకోనివ్వవు. మళ్ళావస్తాను." అంటూ ఆమె లోనికెళ్ళింది. ఆమె వెంట ఆ రెండు జంటలు, ఆ రెండు కుక్కలూ వెళ్ళిపొయ్యాయి.


మిగిలిన వాళ్ళిద్దరూ కబుర్లలో పడ్డారు.

ఫ్లడ్ లైట్స్ కళ్ళు మూసుకున్నాయి. కరెంటు పోయింది. చెవులు పగిలిపొయ్యేలా శబ్దం. విమానం దూసుకుపోతోంది ఆకాశంలోకి. మిణుగురు పురుగులా పచ్చరంగు దీపాన్ని ఆర్పుతూ వెలిగిస్తూ చీకటి, కుట్రలకు అనుకూలమైన చీకటి. అతిథి కుర్చీ డాక్టర్‌కు మరింత దగ్గరగా గుంజుకున్నాడు. గొంతు సర్దుకొని మెల్లగా ప్రారంభించాడు.

"డాక్టర్ మీ కోరిక తీర్చటానికి మేము ఎంతో శ్రమ పడ్డాం. మీకు తెలుసు. దానికి ప్రతిఫలం కోరడంలేదు మేము. కానీ మీతో మాకొక చిన్న సహాయం కావాలి. మంజుల అని మన రావ్‌గారి మేనకోడలు. ఢిల్లీలో జె. యన్. యూనివర్శిటీలో యం. యస్‌సి. చదువుతోంది. తల్లి దండ్రులకు ఒక్కతే బిడ్డ. చాలా తెలివిగలది. కానీ ఏం లాభం ? పాపం. చిన్నవయస్సులోనే కళ్ళకు క్యాన్సర్ ఎఫెక్ట్ అయింది. ఇప్పుడే ప్రారంభం. ఆ కళ్ళను ఆపరేట్ చేసి తీసివెయ్యాలి.... లేకపోతే అది బ్రెయిన్‌కి కూడ ప్రాకుతుందట. ఈ ఆపరేషన్ ఢిల్లీలో చేయించగలము. కానీ ఆ పిల్ల గుడ్డిదవుతుంది.... పెళ్ళి కావల్సిన పిల్ల.... గుడ్డిది కాకుండా మీరు చూడగలరని ఇంతదూరం వచ్చాను.... మీపై ఆశ పెట్టుకొని ..." ప్రతిమాలుతూన్న ధోరణిలో ఆగిపొయ్యాడు.

ఆ మాటలు విన్న డాక్టర్‌కు చెమటలు పోశాయి. కొద్దిగా నిభాయించుకుని .... "ఐ-బ్యాంకులో కళ్ళు నిలవలేవు.... మన దేశంలో ఇంకా మనుషులు ఎదగలేదు. శవంతో పాటే అమూల్యమైన కళ్ళను కూడా దహనం చేస్తారు. కళ్ళులేవి మరొక వ్యక్తికి చూపు కలిగించవచ్చని అనుకోరు.... ఫారిన్ కంట్రీస్‌తో పోలిస్తే మనం ఎంతో వెనుకబడి ఉన్నాం". అంటూ సంజాయిషీ చెప్పుకుపోసాగాడు.

"అవన్నీ నాకు తెలియును. మంజులను మీ చేతుల్లో పెడుతున్నాను కళకళ లాడుతూన్న కళ్ళతో ఆ పిల్ల మమ్మలను చూడాలి. రేపు మార్నింగ్ ఫ్లయిట్‌లో మంజుల, ఆమె తల్లి వస్తారు. మన నర్సింగ్ హోమ్‌లో ఏ. సి. రూమ్స్ ఉన్నాయి కదా!" అంటూ లేచి. "నేను వెళ్ళాలి. నాకు వేరే ఎంగేజ్‌మెంటు ఉంది.




బ్లూమూన్ హోటల్‌లో" అంటూ పెద్ద పెద్ద అంగలు వేస్తూ కారు వద్దకెళ్ళాడు. అతనిని సాగనంపి, డాక్టర్ మళ్ళీ వచ్చి కుర్చీలో కూలబడ్డాడు.

ఏమీ పాలుబోవడంలేదు. మస్తిష్కంలో ఆలోచనలు. సమస్యను పరిష్కరించటానికి మార్గాల అన్వేషణ. కళ్ళుమూసుకుని కణతలు రుద్దుకుంటూ ముందుకు వంగబడి చాలాసేపు ఆలోచించాడు.

లైట్లువచ్చాయి. మళ్ళా వెలుగు. కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. మనసుకు ఎంతో రిలీఫ్ కలిగింది.

"బోయ్. వెళ్ళి మన కాంపౌండర్ జనార్దన్‌ను పిలుచుకురా! పేషంట్స్ వార్డులో వుంటాడు" అని బిగ్గరగా అన్నాడు. జనార్దన్ వచ్చి వినయంగా చేతులుకట్టుకొని నిలబడ్డాడు.

"జనార్దన్. ఇందాక సాయంత్రం నాలుగున్నరప్పుడు ముసలోడొచ్చాడు చూడు- వీరయ్య- కాట్రాక్ట్ పేషంట్. వాడిని ఎక్కడికీ పోనివ్వకు. మన నర్సింగ్‌హోమ్‌లో అడ్మిట్ చెయ్య. వాడి మీల్స్, మందులూ అన్నీ మనవే..వాడున్నాడా పొయ్యాడా" అనడిగాడు.

"వాడు మన గేటుకాడేన్నె తిష్టవేశాడు సార్. వాడు మనల్ని విడిచిపెట్టేలా లేడు సార్. పెద్ద శనిగాడిలా తగిలాడు మనకు" అన్నాడు.

డాక్టర్ కళ్ళలో సంతృప్తి. పదిగంటలు వినిపించాయి. దూరాన్నుంచి తేలికపడిన హృదయంతో డాక్టర్ డైనింగ్‌హాలు వైపు నడిచాడు.

* * *

మూడు నెలల తరువాత ఒకనాటి శనివారం ఉదయం.

డాక్టర్ ఫణీంద్ర నర్సింగ్‌హోమ్ ముందు రోగులు ఒక్కొక్కరే రాసాగారు. నాలుగు చక్రాల తోపుడు బళ్ళపై ఆపిల్స్. అరటిపళ్ళు అమ్ముకునే చిన్న అమ్మకందార్లు. తమ తమ బండ్లను ప్రహరీ గోడ ప్రక్కన నిలుపుకొని పండ్లపై దుమ్మును బట్టతో రాలగొడుతున్నారు. ఎదురుగ్గా వున్న పేవ్‌మెంట్‌పై టీ దుకాణం యజమాని "కెటిల్" బొగ్గులపైపెట్టి చక్రం తిప్పుతూ బొగ్గులను మండిస్తున్నాడు.

గేటు మూసి వుంది. గేటు లోపల పేషంట్స్ వార్డ్సులో సంచలనం ఢిల్లీ నుంచి వచ్చిన పేషెంట్ కుమారి మంజుల తిరుగు ప్రయాణం. మంజుల కంటికి చికిత్స పొంది ఆసుపత్రి నుంచి విడుదలవుతున్నరోజు. నర్సింగ్ హోమ్‌లోని ఏ.సి. రూమ్స్‌లో అందరూ బిజీగా వున్నారు. జూనియర్ డాక్టర్లు. నర్సులు. ఆయాలు. కాంపౌండర్లు.

కళ్ళ విషయంలో ఆమె తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు, ఆమె వాడవలసిన మందులు, మొదలైన సలహాలను ఫణీంద్ర ముగించాడు. సమాధానంగా మంజుల కంఠం,

"రియల్లీ.... ఇదొక ఎచీవ్‌మెంట్. అంకుల్. ఢిల్లీలో వున్న స్పెషలిస్టు లందరూ నా కళ్ళు చూసి పెదవి విరిచారు. నాకు మళ్ళీ చూపు కల్పించారంటే. మీ నైపుణ్యాన్ని. ప్రతిభను నిజంగా కొనియాడాలి.. రేపు మా జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఇదొక వండర్ అనుకోండి".... కళ్ళు రెపరెపలాడించుకుంటూ అంటోంది.

"కేవలం మానవ ప్రతిభేకాదు. భగవంతుని సంకల్పం కూడా వుండాలి." డాక్టర్ తన అభిప్రాయాన్ని జోడించాడు.

"ఏమో అంకుల్ ఆ నమ్మకాలు నాకు లేవు.... మీకు పద్మశ్రీ కాదు.. భారతరత్న ఇచ్చి గౌరవించాలి. మనది ఉత్త వెధవ దేశం. ఇక్కడ ప్రతిభ వున్న వాళ్ళను గుర్తించరు. అందుకనే ఎంతోమంది సైంటిస్ట్స్ అమెరికాకు. గల్ఫ్ కంట్రీస్‌కు వెళ్ళిపోతున్నారు. మీ విషయంలో భారత దేశం కొంత నయం..

....లేటుగానయినా మిమ్మల్ని పద్మశ్రీతో గుర్తించింది.... అన్నట్టు....అంకుల్....మీరు వచ్చే నెలలో "చికాగో" వెళ్తున్నారుకదా! మీ క్లబ్ అంతర్జాతీయ సదస్సులో పాల్గొనడానికి.... వెళ్ళేటప్పుడు మా ఇంటికి తప్పక రావాలి....మమ్మల్ని డిజప్పాయింట్ చెయ్యరు గదూ?" గోముగా, ముద్దుగా, మారాము చేస్తున్నట్టు అడిగింది.

"తప్పక వస్తాను. ఢిల్లీ వచ్చి మీ ఇంటికి రాకుండా వెళ్ళటమా? ఇంపాజిబుల్" డాక్టర్ ప్రత్యుత్తరం.

"దీనికి పుస్తకాల పిచ్చి. ఎక్కువసేపు చదివి మళ్ళీ కళ్ళు పాడుచేసుకోవద్దని మరొకసారి చెప్పండి" ప్రక్కన నిలబడి వింటున్న మంజుల తల్లి డాక్టర్‌ని ప్రాధేయపడింది.

"అంతా రెడీ అయింది. రెండు సూట్‌కేసులూ బ్రీఫ్ కేసూ కారులో పెట్టాము. ఇక నువ్వు తయారుకావటమే" మిసెస్ ఫణీంద్ర అన్నారు.

"నేనెప్పుడో తయారయ్యాను. నాదేముంది?" అని మరొక్కసారి చెంపలపై పఫ్ కొట్టి, క్రింది పెదవికి లిప్‌స్టిక్ కేక్ దిద్దింది. వానిటీ బ్యాగ్ చంకకు తగిలించుకుని చుట్టూ పరికించి చూసి "వస్తాను. నమస్తే" అంది.

నిశ్చలంగా వెలుగుతూన్న లైట్లకాంతిలో నర్సులూ, ఆయాలు, కంపౌండర్లు. వాళ్ళ చూపులు అర్థిస్తున్నాయి. ఏదో జ్ఞాపకం వచ్చినట్లు, 'ఐయామ్ సారీ' అంటూ బ్యాగ్ జిప్ లాగింది. వంద రూపాయల నోట్లు రెండు మూడు తీసి ఒక నర్సు చేతిలో పెట్టింది. "థాంక్యూ" అన్నారు వాళ్ళందరూ సామూహికంగా.

మంజుల మెట్లుదిగి పోర్టికోలో ఉన్న ఇంపాలాలో కూర్చుంది. ఆమెకు ఒకవైపు తల్లి. మరొకవైపు మిసెస్ ఫణీంద్ర కూర్చున్నారు. ఫణీంద్ర, వెనుక ఉన్న అంబాసిడర్‌లో కూర్చున్నారు.

గేటు బార్లగా తెరిచాడు ప్యూన్.

కారు గేటులో కెళ్ళింది మెల్లగా.

గుంటలుపడ్డ సత్తు పళ్ళాన్ని రెండు చేతులతో గాలిలో ఎత్తిపట్టుకొని ఆకాశం వైపు నిశ్చలంగా చూస్తూన్న గుడ్డి ముసలోడు పెద్దగా అరుస్తున్నాడు.

"అవ్వా .. దొరసానీ....మంజులవ్వా!....బాంచను. ఈ గుడ్డోడ్ని మరిసిపోకు. నీకూ, నాకూ ఒక్కనాడే ఆపరేశను చేసిండు. ఆ దరమ పెబువు. ఆయన సేతి సలవ. నీకు సూపొచ్చింది. నాకు సూపు రాలేదు. నా కరమ రాచపుండు బుట్టి నాకు సూపు పోయింది" బిగ్గరగా అంటున్నాడు.

కన్ను గుడ్లు పీకేసినరెప్పలు, బల్బులు పీకేసిన దోమ్పులా.

"జస్ట్-ఎ-మినిట్" మంజుల గొంతు. కారాగింది.

"ఇదిగో పది రూపాయలు" అంటూ నోటు సత్తు పళ్ళెంలోకి విసిరింది.

వేగం పుంజుకొన్న కార్లు మలుపు తిరిగి "ఎయిర్ పోర్ట్" వైపు దూసుకొని పొయ్యాయి.

ఆ గుట్టల ప్రదేశమంతా అందమైన భవనాలు. అన్నీ విలాసవంతమైన ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లు. నగరం వీపుపై రాచపుండ్లలా మొలచిన ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లు. రాచపుండులో కదుల్తూన్న క్రిముల్లా రోగులు. రాచపుండు నుంచి కారుతూన్న రక్తంపై వాలుతూన్న ఈగల్లా డాక్టర్లు, నర్సులు, కంపౌండర్లు, ఆయాలు, వార్డ్ బోయ్‌లు.

నగరం ఒళ్ళు విరుచుకొంటోంది. ●

